# గొప్ప స్వాస్థ్యము
## (యెహోషువ గ్రంథ సంగ్రహ సమీక్ష)

### A. ఉపోద్ఘాతము :

పాతనిబంధనలోని చరిత్ర గ్రంథాలలో ఇది మొదటి పుస్తకం. దేవుడు మనకు ఇచ్చే ప్రతి ఆశీర్వాదాన్ని మనం ఎలా స్వంతం చేసికోవాలో ఈ గ్రంథం తెలియజేస్తుంది. ఇది దేవునిచే ఏర్పరచబడిన ప్రజల చరిత్ర కొనసాగింపు. ద్వితీయోపదేశకాండము తరువాత జరిగిన చరిత్రను ఈ గ్రంథం కొనసాగిస్తుంది.

1. **గ్రంథకర్త :** మోషే తదనంతరం ఇశ్రాయేలీయులకు నాయకునిగా ఉన్న యెహోషువ, చివరి ఐదు వచనాలుతప్ప ఈ గ్రంథాన్నంతా వ్రాసాడని తాల్మూద్ గ్రంథం తెలియజేస్తున్నది. ఇతడు ఇశ్రాయేలు ఐగుప్తు దాసత్వంలో ఉన్నప్పుడు పుట్టాడు. నిర్గమము సమయంలో అతని వయస్సు 40 సంవత్సరాలు. కాదేషుబర్నే నుండి కనానును వేగుచూడదానికి పంపబడిన 12 మందిలో ఇతడు ఒకడు. యెహోషువ ధైర్యశాలి, గొప్ప ప్రార్థనాపరుడు, విశ్వాసము, నాయకత్వపు లక్షణాలు, ఆసక్తి గలవాడు. యెహోషువ అన్న పేరుకు "యెహోవాయే రక్షణ" అని అర్థం. ఇదే హెబ్రీ పదము క్రొత్తనిబంధనలో యేసు అన్న పేరుకు ఉపయోగించబడింది. యెహోషువ పేరులోను పనిలోను క్రీస్తులాంటివాడు.

2. **ఉద్దేశం :** రక్షణ అంటే నరకం నుండి విమోచించబడుట మాత్రమే కాదని, అది పరలోకములో ప్రవేశించేందుకైన విమోచన అని ఈ గ్రంథం తెలియజేస్తుంది. ఇశ్రాయేలీయులు ఐగుప్తునుండి విడిపించబడదానికే విమోంచించబడలేదు గాని, కనానులో ప్రవేశించేందుకే విమోచించబడ్డారని ఇది తెలియజేస్తుంది.

3. **మూల వాక్యం :** "మీరు. అడుగుపెట్టు ప్రతి స్థలము మీకిచ్చు చున్నాను." (యెహో 1:3).

4. **ముఖ్యమైన మాట :** స్వాస్థ్యము.

5. **గ్రంథ విశిష్ఠత :** ఈ గ్రంథము యేసు క్రీస్తును మన రక్షణకర్తగా చూపిస్తుంది. దేవుడు అబ్రాహాముకిచ్చిన వాగ్దానాన్ని (ఆది 12:1-3) నెరవేర్చుటలో ఆయన నమ్మకత్వాన్ని ఈ గ్రంథం ఋజువు చేస్తుంది.

   దేవుడు తన ప్రజలైన ఇశ్రాయేలీయులను దాసగృహంలో నుండి విమోచించి నడిపించిన విధానం గూర్చి నిర్గమకాండములో వ్రాయబడింది. యెహోషువ గ్రంథంలో



వారిని ఆశీర్వాదకరమైన స్థలానికి నడిపించిన విధానం గూర్చి వ్రాయబడింది. వారిని ఐగుప్తునుండి బయటికి తీసికొని రావడానికి దేవుడు ఎఱ్ఱ సముద్రాన్ని పాయలుచేసాడు. కనానులో ప్రవేశింపజేయడానికి యొర్దాను నదిని పాయలు చేసాడు. (నిర్గ 14:21, 22; యెహో 3:13-17).

యెహోషువ గ్రంథాన్ని పాతనిబంధన ఎఫెసీ పత్రికగా పరిగణిస్తారు. దేవుడు యేసు క్రీస్తులో పరలోక సంబంధమైన ప్రతి ఆశీర్వాదాన్ని మన కొరకు సిద్ధం చేసాడు (ఎఫె 1:3). వాటిని మనం స్వంతం చేసికోవాలి. ఇశ్రాయేలుకు దేవుడిచ్చిన యాజమాన్యం ఏ షరతులేనిది (ఆది 12:7; 15:18-21; 17:8). కాని వారి స్థాస్థ్యము షరతులతో కూడినది (ద్వితీ (29:9-30:20).

నేడు క్రీస్తును విశ్వసించిన వారికి ఇవ్వబడే ఆశీర్వాదాలన్ని ఏ షరతులేనివి. కాని ప్రయోగాత్మకంగా వాటిని స్వంతం చేసికోవడం అన్నది మన ప్రత్యేకత మరియు విజయంపై ఆధారపడి ఉన్నవి. (ఎఫె 6:10-20; గల 5:25; II కొరి 10:3-6; I కొరి 9:25-27; హెబ్రీ 4:11) వీటిని మన భౌతిక శక్తి లేక శరీర సామర్థ్యమును బట్టి పొందలేము గాని, మనల్ని అప్పగించుకొన్నప్పుడు. మనలో పనిచేసే పరిశుద్ధాత్మ శక్తి ద్వారానే సాధించగలుగుతాము.

### B. గ్రంథ విభజన :

#### I. కనాను దేశంలో ప్రవేశించుట (1-12 అధ్యా) :

| | | |
|---|---|---|
| 1. | యెహోషువకు ఇవ్వబడిన ఆజ్ఞ మరియు అప్పగించబడిన పని | 1 అధ్యా |
| 2. | వేగులవారు రాహాబును కలిసికొనుట | 2 అధ్యా |
| 3. | యొర్దానునది దాటుట | 3 అధ్యా |
| 4. | రెండు జ్ఞాపికలను నిర్మించుట | 4 అధ్యా |
| 5. | స్వాధీనపరచుకొనుటకు షరతులు మరియు సిద్ధపాటు | 5 అధ్యా |
| 6. | దేశం యొక్క కేంద్రంపై దాడి (6-8 అధ్యా) | |
| | ఎ) యెరికోను జయించుట | 6 అధ్యా |
| | బి) హాయిని జయించుట | 7,8 అధ్యా |
| 7. | దక్షిణ భాగముపై దాడి (9, 10 అధ్యా) | |
| | ఎ) గిబియోనీయులతో సంధి | 9 అధ్యా |
| | బి) అమోరీయుల 5 గురు రాజులను జయించుట | 10 అధ్యా |
| 8. | ఉత్తర భాగముపై దాడి | 11 అధ్యా |
| 9. | జయించిన రాజుల జాబితా | 12 అధ్యా |

## II. కనాను దేశము పంచి పెట్టబడుట (13-22 అధ్యా)

1. యెహోషువకివ్వబడిన ఆజ్ఞపూర్తి అగుట 2 1/2 గోత్రాలకు స్వాస్థ్యం స్థిరపరచబడుట — 13 అధ్యా
2. కాలేబుకు హెబ్రోను ఇవ్వబడుట — 14 అధ్యా
3. ఇశ్రాయేలు గోత్రాలకు భూమి పంపకం — 15-19 అధ్యా
4. ఆశ్రయపురాలు — 20 అధ్యా
5. లేవీయుల పట్టణాలు — 21 అధ్యా
6. 2 1/2 గోత్రాలు తమ పట్టణాలకు తిరిగి వెళ్ళాలన్న ఆజ్ఞను పొందుట - బలిపీఠాన్ని నిర్మించుట — 22 అధ్యా

## III. యెహోషువ చివరి ప్రసంగం (23, 24 అధ్యా)

1. ధైర్యంగా మరియు నిశ్చయత కలిగి ఉండాలని ఇశ్రాయేలు నాయకులకు పిలుపు నిచ్చుట. — 23 అధ్యా
2. సమర్పణ కొరకు మరియు దేవునితో నిబంధనను స్థిరపరచుకొనుటకు ఇశ్రాయేలు గోత్రాలన్నిటికి పిలుపునిచ్చుట మరియు యెహోషువ మరణం — 24 అధ్యా

## C. అంశాల వారిగా సంక్షిప్త వివరణ :

యెహోషువ గ్రంథాన్ని రెండు ప్రధాన విభాగాలుగా విభజించవచ్చును. ఈ గ్రంథంలోని ప్రతి కోణంలో విశ్వాసం కనిపిస్తుంది.

## I. వాగ్ధాన భూమిని జయించుట :

**1. ఎడతెగని విశ్వాసం-సైన్యాన్ని సన్నద్ధం చేయుట (1, 2 అధ్యా) :** యెహోషువ గ్రంథ ప్రారంభంలో, ఇశ్రాయేలీయులు వాగ్ధాన దేశపు సరిహద్దులలో, యొర్దాను నది తీరాన ఉన్నారు. యెహోషువ 1:4 లోని వివరాల ప్రకారం వాగ్ధాన భూమికి దక్షిణ దిక్కున అరణ్యం, ఉత్తరాన లెబానోను పర్వతాలు, తూర్పున యూఫ్రటీస్ నది, పశ్చిమ దిక్కున మధ్య ధరా సముద్రం సరిహద్దులుగా ఉన్నాయి.

నాయకునిగా ఉండాల్సిన యెహోషువకు సలహాలిచ్చే మోషే ఇప్పుడు అతనితో లేదు. కాని దేవుడు అతనికి తన్ను తాను ప్రత్యక్షపరచుకొని అతన్ని ప్రోత్సహించాడు. దేవుడు అతనితో మోషే మృతినొందాడు ఇక లేడు అన్న మాటలతో సంభాషణ మొదలు పెట్టాడు (1:1) సాధారణంగా ఒక నాయకుని వద్ద శిక్షణ పొందినవారు తాము ఆ నాయకుని ద్వారా నేర్చుకొన్నాము గనుక దేనినైనా చేయగలమన్న ధీమాతో ఉంటారు లేదా తమ నాయకుడు ఇక లేడు గనుక ఏమి చేయలేమన్న నిరుత్సాహంతో ఉంటారు.



కనుక యెహోషువ మోషే మృతినొందాడని నిరుత్సాహపడవద్దని లేక మోషే నుండి నేర్చుకొన్న అనుభవాన్ని బట్టి తొందరపడవద్దని జ్ఞాపకం చేస్తూ దేవుడు యెహోషువ చేయాల్సిన దానిని తెలియజేసాడు. వాస్తవంగా మోషే ద్వారా పొందిన అనుభవం యెహోషువకు సరిపోదు. మోషే ప్రజలను అరణ్యంలో నడిపించాడు. యెహోషువ వారిని కనానులోనికి నడిపించాలి. అందుకు యుద్ధాలు చేయాలి. కాబట్టి ఇది క్రొత్త అనుభవం. అయితే ఏ వ్యక్తి అనుభవానికి అవసరమైన సామర్థ్యాన్ని ఆ వ్యక్తికి దేవుడు ఇస్తాడు. అందుకే "నేను మోషేకు తోడైయుండినట్లు నీకును తోడైయుందును" అని వాగ్ధానం చేసాడు. (1:5).

ఇక్కడ మరో ఆత్మీయ సత్యాన్ని గమనించాలి. మోషే కనానులో ప్రవేశించడని దేవుడు చెప్పాడు గనుక, ఇశ్రాయేలీయులు దానిలో ప్రవేశించక ముందే అతడు చనిపోవాలి. అతడు వారిని దానిలో ప్రవేశపెట్టలేదు. మోషే ధర్మశాస్త్రానికి సాదృశ్యంగా ఉన్నాడు. యెహోషువ క్రీస్తుకు సాదృశ్యంగా ఉన్నాడు. వీరిద్దరు క్రీస్తు పూర్తి చేసిన రక్షణ కార్యాన్ని ప్రత్యక్షపరుస్తున్నారు. క్రీస్తు సిలువ కార్యం ద్వారా సంపాదించిన స్వాస్థ్యంలోనికి ఆయనే మనల్ని నడిపిస్తాడు.

అనేక సంవత్సరాల క్రితం వాగ్ధానం చేయబడిన స్వాస్థ్యంలోనికి అడుగిడేందుకు ప్రజలు ఎంతో ఆతురతతో ఎదురు చూస్తున్నారు. వారు అడుగు ముందుకెయ్యాలి. (1:3) అంతా స్వాధీనం చేసికోవాలి (1:4).

1:1-9 వరకు దేవుడు యెహోషువతోమాట్లాడాడు 1:11-18 వరకు యెహోషువ ప్రజలతో మాట్లాడాడు. వారు యెహోషువకు ఇచ్చిన అభయం, వారి విధేయతకు నిదర్శనంగా ఉన్నది. "నీవు మాకాజ్ఞాపించినదంతయు మేము చేసెదము, నీవు మమ్మునెక్కడికి పంపుదువో అక్కడికి పోదుము. మోషే చెప్పిన ప్రతిమాట మేము వినినట్లు, నీ మాట విందుము" (1:16).

**2. విశ్వాసంలో కలవరపర్చే సమస్యలు - ముందుకు సాగుట (2-5 అధ్యా):**కనాను దేశాన్ని వేగు చూసేందుకు వెళ్ళిన 12 మందిలో ఒకడైన యెహోషువ, అదే విధానాన్ని అనుసరించి, యెరికో పట్టణానికి ఇద్దరు వేగులవారికి పంపించాడు. అది వారు ఎదుర్కొబోయే మొదటి బలమైన దుర్గము కనుక దాని శక్తిని తెలిసికోవడం అవసరం.

**అ) విశ్వాసం యొక్క చిత్రీకరణ :** వేగులవారు వచ్చిన విషయం తెలిసిన యెరికోరాజు వారిని పట్టుకొనేందుకు మనుష్యులను పంపించాడు. ఇశ్రాయేలీయుల పట్ల దేవుడు చేసిన కార్యాలను విని, విశ్వసించిన రాహాబు అనే వేశ్య వారిని దాచిపెట్టింది. ఈ కార్యాన్ని ఆమె విశ్వాసాన్ని బట్టి చేసింది. (హెబ్రీ 11:31) యాకోబు పత్రికలో ఆమె విశ్వాసం క్రియాపూర్వకమైనది ప్రశంసించబడింది. (యాకో 2:25).

ఆ) **నిరూపించబడిన విశ్వాసం :** వేగులవారి నివేదికను బట్టి, ఇశ్రాయేలీయులు షిత్తీము నుండి బయలుదేరి యొర్దాను దాటారు. వారు అరణ్యంలో మేఘాన్ని వెంబడించారు, ఇప్పుడు దేవుని సన్నిధిని సూచించే మందసాన్ని వెంబడిస్తున్నారు. వారు క్రొత్త అనుభవాల గుండా వెళ్తున్నారు. విశ్వాసి జీవితం ఎప్పుడూ ఒకేలాగ ఉండదు. అనేక నూతన అనుభవాలుంటాయి. వారు దేవుని మందసాన్ని మోస్తున్న యాజకులను వెంబడించాలి. అంతే. దేవుడు మనల్ని నడిపిస్తున్నప్పుడు, మనం వెళ్తున్న మార్గం మనకు తెలియకున్నా వెళ్ళాలి. ఎందుచేతనంటే మన అసాధ్యమైన వాటిని చేయబూనుకొన్నప్పుడు ఆయన వాటన్నింటిని సాధ్యపరుస్తాడు.

యొర్దాను నది గట్లపై నుండి పొంగి ప్రవహిస్తూ ఉండగా, యెహోషువ యాజకులను యొర్దానులో నిలవమని చెప్పాడు. వారి పాదాలు నీళ్ళను తాకగానే ఆ ప్రవాహం ఆగిపోయి, ఆరిన నేల ఏర్పడింది (3:9-17). మందసం దేవుని సన్నిధికి సాదృశ్యంగా ఉంది. ఆయన సన్నిధి వారితో ఉంది గనుక అసాధ్యమైన వాటిని చేయగలగారు.

ఇ) **విశ్వాసస్తూపం :** వారు యొర్దాను నదిని దాటిన తరువాత యాజకుల కాళ్ళు నిలిచిన స్థలంలోని 12 రాళ్ళను, అవతలి ఒడ్డుకు తీసికొని వెళ్ళి దేవుని అద్భుత కార్యానికి జ్ఞాపకార్థంగా నిలువబెట్టారు (4:3).

ఈ) **విశ్వాసంలో మొదట అవసరమైనది :** ఆ తరమువారు అరణ్య యాత్రలో సున్నతి పొందలేదు గనుక వారు గిల్గాలుకు వచ్చినప్పుడు వారందరికి సున్నతి చేయమని దేవుడు చెప్పాడు. వారు దేవునికి విధేయత చూపించారు. విశ్వాసంలో మొదట అవసరమైనది విధేయత (5:3-9). వారు ఆ నెల 14వ తేదీ సాయంకాలము యెరికో మైదానములో పస్కా పండుగను ఆచరించారు (5:10). మరునాడు వారు ఆ దేశపు పంటను తింటూ ఉండగా మన్నా కురవడం ఆగిపోయింది (5:11,12).

ఈ సందర్భంగా యెహోవా దూత యెహోషువకు ప్రత్యక్షమైన విధానం గమనార్హం (5:13-15). దేవుడు యెహోషువకు ఈ ప్రత్యక్షత ద్వారా ధైరాన్నిచ్చాడు. యుద్ధాలు చేయడానికే వెళ్తున్న యెహోషువకు యెహోవా సేనాధిపతిగా ఆ దూత పంపించబడ్డాడు.

3. **విశ్వాసమును అభ్యాసం చేయుట-యెరికో నాశనం చేయబడుట (6 అధ్యా) :** యెరికో పట్టణం దక్షిణ కనానుకు ప్రధాన కేంద్రం. దాని ప్రాకారం రెండు భాగాలుగా ఉండినది. వెలుపలిగోడ 6 అడుగుల మందము గలది. దానికి 12 అడుగుల నుండి 15 అడుగుల దూరంలో 12 అడుగుల మందముగల మరో గోడ ఉండినది. అది దాదాపు 30 అడుగుల ఎత్తుగలది.



యెరికోను జయించడానికి దేవుడు చెప్పిన విషయాలు ఇశ్రాయేలీయులకు వింతగా ఉండవచ్చును. అయితే తమకు అర్థంగాని విషయాలు తమనాయకునికి బాగా తెలియునని, త్వరలో వారు ఆ పట్టణంలో ప్రవేశిస్తామని నమ్మారు.

యాజకులు బూరలు ఊదుతూ ఉండగా వారి వెనుక ప్రజలు ఈ ప్రాకారం చుట్టూ తిరుగుతూ ఉంటే యెరికో ప్రజలకు కూడ వింతగా తోచి ఉండవచ్చు. ఆ గోడలు కూలిపోయాక దేవుని కార్యం వారికి అర్థమై ఉండవచ్చును. ఈ లోగా వారు నశించిపోయారు. కొంతమంది, వైజ్ఞానికంగా ఇది బూరల ధ్వని వలన కలిగిన ప్రకంపనాల వల్ల కూలిపోయిందని తేలిగ్గా కొట్టిపారేస్తారు. దేవుడు విజ్ఞాన శాస్త్రాన్ని ఉపయోగించకుండ కూడ అద్భుతాలు చేయగలడు. యెరికో గోడలు కూలిపోవడం వాస్తవమైన అద్భుతం. ప్రజల మరియు యెహోషువ దేవుని ఆజ్ఞకు లోబడినపుడు దేవుని శక్తిని చూడగలిగారు. మనకు వెర్రిగా కనిపించే విషయాల ద్వారానే దేవుడు విజయాలను ఇవ్వగలడు. యెరికో పట్టణం నాశనం చేయబడింది (హెబ్రీ 11:30) అయితే రాహాబు విశ్వాసమును బట్టి, ఆమె మరియు ఆమె కుటుంబము మినహాయించబడ్డారు. తరువాత ఆమె హెబ్రీయుడైన షల్మానును వివాహం చేసికొన్నది. ఇతడు బహుశా ఆ ఇద్దరు వేగులవారిలో ఒకడు కావచ్చును.

యెరికో ప్రజలందర్నీ దేవుడు నాశనం చేయడానికి కారణం, తన ప్రజలు పవిత్రంగా జీవించాలని, రాహాబును రక్షించడానికి కారణం, క్రీస్తు వంశావళి కొనసాగించబడాలని. యెహోషువ 6వ అధ్యాయం 26వ వచనంలో ఒక ప్రకటన చేసాడు. కీ. పూ. 1406 సం॥ చేయబడిన ఈ ప్రకటన క్రీ. పూ. 930 సం॥ నెరవేరింది. (I రాజు 16:34).

4. **హాయిపై దాడి (7, 8 అధ్యా) :** ఇశ్రాయేలీయులు యెరికోను పట్టుకోవడంతో కనానులో ప్రవేశించారు. తరువాత ఆక్రమించుకోవలసిన పట్టణం హాయి. దానిని గూర్చి తెలిసికోడానికి యెహోషువ మరలా వేగులవారిని పంపించాడు. వారు రెండు లేక మూడు వేల మంది దానిని పట్టుకోవచ్చునని సమాచారం తీసికొనివచ్చారు. అయితే హాయి వారు ఇశ్రాయేలీయులను చిత్తుగా ఓడించారు. దేవుడు తన హస్తాన్ని వెనక్కి తీసికొన్నట్లు ప్రజల గ్రహించారు. మన స్వంత శక్తిపై ఎప్పుడూ ఆధారపడకూడదని ఈ సంఘటన బోధిస్తున్నది.

అ) **విశ్వాసం నుండి తొలగిపోవుట :** ఓటమికి కారణం ఒక్క వ్యక్తి పాపం. ఆకాను శపితమైన దానిలో కొంత దాచుకొని దేవుని ఆజ్ఞను మీరాడు (7:13). అతని పాపాన్ని బట్టి అతనికి, అతని కుటంబానికి కూడ శిక్ష విధించబడింది. (7:16-26). ఎవరి పాపమేగాని వారొక్కరికే నష్టం కలిగించదు. వారి కుటుంబానికి మరియు సమాజానికి కూడ నష్టం

కలిగిస్తుంది. అది అంటువ్యాధిలా వ్యాపిస్తుంది. మరో సత్యాన్ని ఎప్పుడూ జ్ఞాపకం ఉంచుకోవాలి. ప్రతి రహస్యపాపం తప్పకుండ వెలుగులోనికి తీసికొని రాబడుతుంది. మనం మానవ చట్టం నుండి తప్పించుకో వచ్చును. కాని దైవ శాసనం నుండి తప్పించుకోలేమని ఆకాను సంఘటన జ్ఞాపకం చేస్తున్నది. ఆకాను తన పాపాన్ని ఒప్పుకొన్నట్లే ఉన్నా, అతనిది నిజమైన మారుమనస్సుకాదు. పట్టబడిన తరువాత పాపాన్ని ఒప్పుకొన్నాడు, గాని పశ్చాత్తాపపడలేదు.

**ఆ) విశ్వాస శుద్ధీకరణ :** శాపగ్రస్తమైనది ఇశ్రాయేలీయుల మధ్య నుండి తీసివేయబడ్డాకనే హాయిపై విజయాన్ని పొందగలిగారు. (8:1-23) విశ్వాసి జీవితంలో కూడ కొన్ని పర్యాయాలు చిన్న విషయాలలో అపజయంపాలవుతూ ఉంటారు. అందుకు కారణం దేవునికి అయిష్టమైన, శాపగ్రస్తమైనదేదో వారిలో దాచుకొని ఉంటారు. దానిని విడిచిపెట్టేందుకు ఇష్టపడరు. కాని దేవుని మాటకు విధేయత చూపించి, ఆయనకు అయిష్టమైన దానిని జీవితంలో నుండి తీసివేస్తే గొప్ప విజయాన్ని పొందుతారు. కనుక ప్రతిరోజు మనల్ని మనం పరిశీలించుకోవాలి. (కీర్త 139:23,24).

తరువాత మోషే ధర్మశాస్త్ర గ్రంథములో వ్రాయబడిన ప్రకారము, యోహోషువ ఇనుప పనిముట్లు తగిలింపని రాళ్ళతో ఏబాలు కొండమీద యెహోవా నామమున బలిపీఠమును కట్టి దహనబలులు, సమాధాన బలులు అర్పించాడు. వారిలో సగము మంది గెరీజీము కొండ యెదుట, సగము మంది ఏబాలు కొండ యెదుట నిలిచియుండగా యెహోషువ ధర్మశాస్త్ర గ్రంథములోని వాక్యాలన్నిటిని అనగా దీవెన వచనాలు మరియు శాపవచనాలన్నీ చదివి వినిపించాడు. (8:30-35; ద్వితీ 27:11-13).

**5. విశ్వాస స్పష్టత - దక్షిణ భాగంపై దాడి (9-10 అధ్యా) :** యొర్దాను అవతలనున్న మన్యములోను, లోయలోను, లెబానోను యెదుటి మహా సముద్ర తీరములోని హిత్తీయులు, అమోరీయులు, కనానీయులు, పెరిజ్జీయులు, హివ్వీయులు, యెబూసీయులు అనువారి రాజులందరు జరిగిదానిని విని యెహోషువతో యుద్ధం చేయడానికి వచ్చారు (9:1,2).

యెహోషువ యెరికోకు, హాయికి చేసినదానిని విని గిబియోనీయులు కపటోపాయముతో నిబంధన చేసికొన్నారు. తరువాత వారు తమ పొరుగువారేనని తెలిసికొన్న యెహోషువ వారిని సమాజము కొరకు, బలిపీఠము కొరకు కట్టెలు నరుకు వారిగా, నీళ్ళు చేదువారిగా నియమించాడు. (9:21) విశ్వాస జీవితంలో దైవిక నడిపింపు అవసరం అని స్పష్టమౌతుంది. (రోమా 12:2; ఫిలి 3:13,14).

తరువాత యెరూషలేము రాజు, అమోరీయుల రాజులందరితో కలిసి యెహోషువ పైకి యుద్ధానికి రాగా వారి పక్షంగా యెహోవా యుద్ధం చేసిన విధానం 10:10-13



లో వ్రాయబడింది. గిబియోనులో సూర్యుడు చలిచి పోయిన సంఘటన ప్రపంచ చరిత్ర ఋజువు చేస్తుంది. ప్రపంచ చరిత్రలో 24 గంటల సమయం అధికంగా ఉన్నట్లు శాస్త్రజ్ఞులు కనుగొన్నారు.

దేవుడు భూమి వేగాన్ని తగ్గించినందు వల్ల సూర్యుడు నిలిచాడు అని లేక స్థానికంగా సూర్యకిరణాలను నిలిపాడని (నిర్గ 10:21-23; మార్కు 15:33) కొంత మంది అభిప్రాయం కాని ప్రపంచమంతట దాని ప్రభావం ఉండినదని ప్రపంచ చరిత్ర నిరూపిస్తున్నది.

ఆ రాజులందరు పారిపోయి మక్కెదాలోని గుహలో దాగుకొన్నారు. వారు దొరికినప్పుడు యెరూషలేము రాజుతో పాటు అతడు యుద్ధానికి పురికొల్పిన మిగతా 4 గురు రాజులు చంపబడ్డారు. (10:16-27) తరువాత యెహోషువ మక్కేదాను (10:28-30) లాకీషును (10:31-33) ఎగ్లోనును (10:34,35) హెబ్రోనును (10:36,37) దెబీరును (10:38,39) మన్య ప్రదేశాన్ని, దక్షిణ ప్రదేశాన్ని, షెఫెలా దేశమును మరియు చరియ ప్రదేశాలను వాటి రాజులనందరిని జయించాడు. (10:40,41) అలా కాదేషు బర్నేయ మొదలు కొని గాజా మరియు గిబియోను వరకు గోషెను దేశమంతటిని జయించాడు. తరువాత అతడు మరియు ఇశ్రాయేలీయులందరు గిల్గాలులోని పాళెమునకు తిరిగి వెళ్ళారు.

**6. ఉత్తర భాగముపై దాడి (11,12 అధ్యా) :** దక్షిణ కనాను అంతా ఇశ్రాయేలు స్వాధీనమయ్యాక, ఉత్తర ప్రాంత రాజులందరు ఇశ్రాయేలీయుల దాడిని అడ్డుకొనేందుకు ప్రయత్నించారు. అయితే యెహోషువ దైవిక శక్తితో వారందరిని జయించాడు. ఇదంతా ఒక్కసారే జరుగలేదు. అందుకు చాలా కాలం పట్టిందని లేఖనాలు చెప్తున్నాయి (11:23). విజయవంతమైన క్రైస్తవ జీవితాన్ని ఒక్కసారే సాధించలేము. మన శత్రువులైన లోకము, శరీరము మరియు సాతానును అనుదినం జయిస్తూ సంపూర్ణతలోనికి ఎదగాలి. దేవుడు మనకు స్వాస్థ్యంగా ఇచ్చిన వాటిని స్వాధీనం చేసికోవాలి. ఈ భాగములోనే యెరూషలేమును గూర్చిన మొట్టమొదటి ప్రస్తావన ఉన్నది. తరువాత అది ప్రపంచంలోనే ఒక ప్రఖ్యాత స్థలంగా మారింది. యెరూషలేము గొప్ప గత చరిత్ర, మరియు తేజోవంతమైన భవిష్యత్ చరిత్ర గల పట్టణం. యేసు క్రీస్తు తిరిగి వచ్చినప్పుడు, శక్తితో, మహిమతో ఇక్కడే పరిపాలిస్తాడు. (లూకా 21:27).

దేవుడు దుష్టులైన కనానీయులకు తీర్పు తీర్చడం ఇక్కడ మనం గమనించగలం. కనాను క్రీ. పూ. 3500 సం॥లో బబులోనీయులచే పరిపాలించబడింది. గనుక వారి భాషను, సంస్కృతిని కలిగి ఉన్నది. ఇశ్రాయేలీయులు దానిని జయించక ముందు

అనగా క్రీ. పూ. 1400 లో అది ఐగుప్తీయుల పాలనలో ఉన్నదని టెల్-ఎల్-అమర్నా ఫలకాల ద్వారా తెలుస్తుంది. కనానీయ సామంతరాజులు ఫరోకు వ్రాసిన ఉత్తరాలు అందులో ఉన్నాయి. ఇందును బట్టి, వారు ఫరోకు కప్పము చెల్లించేవారని తెలుస్తున్నది. ఇశ్రాయేలీయులు కనానును స్వాధీనం చేసికొనే సమయానికి ఆ దేశమంతా పాఠశాలలు, గ్రంథాలయాలు, చక్కగా అలంకరించబడిన స్థలాలున్నాయి. అప్పటి ప్రపంచంలోని అన్ని దేశాలతో ఇది వర్తకాన్ని కొనసాస్తూ ఉన్నది.

**II. భూమిని పంచి పెట్టుట (13-23 అధ్యా) :** ఈ భాగానికొచ్చేసరికి యెహోషువ 90 సం॥ల వృద్ధుడు. కనాను పూర్తిగా జయించబడలేదు. ఇంకా స్వాధీనపరచు కోవలసిన భూమి చాల మిగిలి ఉంది. ఆ పనిని ఇశ్రాయేలీయులు చెయ్యాలని యెహోషువ దానిని భాగాలుగా చేసి పంచిపెట్టాడు. ఆ స్థలాలలో ఇంకా అమోరీయులు, యెబూసీయులు మరియు హిత్తీయులు మిగిలి ఉన్నా, అవి ఇశ్రాయేలు గోత్రాలకు చెందినట్లే పిలువబడ్డాయి. వారి స్వాస్థ్యంగా ఎంచబడ్డాయి (13 అధ్యా).

**1. విశ్వాసముతో పంచిపెట్టుట :** ఈ భూభాగాలన్నీ దేవుని నడిపింపు ప్రకారం, విశ్వాసంతో పంచిపెట్టబడ్డాయి. మనం మన దర్శనాన్ని ముందుంచుకొని కలలు కనకుంటే, భౌతికంగా గాని, ఆధ్యాత్మికంగా గాని దేనిని పొందలేము, జయించలేము. ఆత్మీయ మంద దృష్టి మరియు అల్ప విశ్వాసంగలవారికి, ప్రస్తుతం సాధించాల్సిన స్వాస్థ్యంలో ఒక్క అడుగు కూడ లభించదు. ఇశ్రాయేలీయులు అక్షరాల ఆలాగే చేసారు. వారు ఓ నిరీక్షణతో తమకు తెలియని భవిష్యత్తులోనికి ప్రవేశించారు, వారికి ఆ భూమి విభజించబడి, పంచిపెట్టబడ్డాక కూడ, ఆ దేశంలోని అధికభాగం ఇంకా తమ శత్రువుల హస్తాలలోనే ఉంది. అది అన్ని గోత్రాల వారికి పంచిపెట్టబడినా, దావీదు కాలం వరకు పూర్తిగా జయించబడలేదు. వారి కాలంలో కొండ ప్రాంతం తప్ప, పట్టణాలను మరియు మైదాన ప్రాంతాలను ఆక్రమించు కోలేకపోయారు.

బలవంతులు, తాము బలవంతులమని మంచి భాగాన్ని పొంది, మిగిలిన భాగాలను బలహీనులకు మిగల్చలేదు. ధనికులు తమకిష్టమైన స్థలాలను కొనుక్కొని పేదలకు పనికిరాని స్థలాలివ్వలేదు. ఈ విషయంలో వారు సంపూర్ణంగా దేవుని చిత్తాన్నే నెరవేర్చారు. ఎవరికి ఏ భాగం ఇవ్వాలో దేవునిచే నిర్ణయించబడింది. దేవుని పిల్లల మధ్య అసమానతలుండకూడదని దేవుడు బహుశ్రద్ధ వహించాడు. దేవుడు ఈ లోకాన్ని స్వయంగా పరిపాలించినప్పుడు, అందరికీ సమానంగా ఆశీర్వాదాలనిస్తాడు. (మీకా 4:4). దేవుని సన్నిధికి చిహ్నంగా ఉన్న మందసం ఎదుట చీట్లు వేయబడినపుడు ఎవరేగాని తమకు వచ్చిన స్వాస్థ్యాన్ని బట్టి నిరాశపడలేదు. లేవీయులకు వారి మధ్య



స్వాస్థ్యం ఇవ్వబడింది (14:3). స్వాస్థ్యాల వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

అ) యొర్దాను తూర్పు దిక్కున - రూబేను, గాదు, మనష్షే అర్ధగోత్రం.

ఆ) యొర్దాను పశ్చిమ దిక్కున - యూదా, ఎఫ్రాయిము, మనష్షే అర్ధగోత్రం, బెన్యామీను, షిమ్యోను, జెబూలూను, ఇశ్శాఖారు, ఆషేరు, నఫ్తాలి మరియు దాను గోత్రాలు.

ఇ) లేవీయులు స్వాస్థ్యం - దేవుడే వారికి స్వాస్థ్యం (13:33). అయినా, మిగతా 11 గోత్రాల స్వాస్థ్యం నుండి 48 పట్టణాలు వారికి ఇవ్వబడ్డాయి (21:41).

**2. విశ్వాసం యొక్క ప్రత్యక్ష సాక్ష్యం :**కాలేబు తన స్వాస్థ్యం పొందేనాటికి అతని వయస్సు 85 సంవత్సరాలు. కనాను దేశాన్ని వేగుచూసిన 12 మందిలో, యెహోషువతో పాటు మిగిలినవాడు ఇతడొక్కడే. అతడు యెహోషువతో, దేవుడు సెలవిచ్చిన కొండ ప్రాంతాన్ని తనకిమ్మని అడిగాడు (14:12). దానిని స్వాధీనం చేసికోడానికి అతడు చాల ప్రయాసపడ్డాడు. (15:13-15). దేవుని సేవించేవారి జీవితం ఎప్పుడూ సజావుగా ఉండదని కాలేబు జీవితం సూచిస్తున్నది. విశ్వాసి జీవితం సజావుగా ఉంటుందని దేవుడు వాగ్దానం చేయలేదు. లోకంలో మనకు శ్రమ కలుగుతుందని ఆయన చెప్పాడు. కాని ఆయన లోకాన్ని జయించాడు గనుక మనకు కూడ జయమునిస్తానని వాగ్దానం చేసాడు. (యోహా 16:33). కష్టాలలోనే మనం ఎదుగుతాము, దేవునిపై నమ్మకముంచుతాము. (II తిమో 2:3). కాలేబు తన పూర్ణ హృదయంతో దేవుణ్ణి వెంబడించాడు (14:8).

**3. విశ్వాసం యొక్క ప్రతికూల సాక్ష్యం :** కొన్ని గోత్రాలవారు శత్రువులందరిని తోలివేయలేక పోయారు (15:63; 16:10; 17:12; 19:47). వారి వైఫల్యాన్ని బట్టి న్యాయాధిపతుల కాలంలో, ఈ శత్రువులకు బానిసలయ్యారు.

**4. విశ్వాసం యొక్క స్థితి - యెహోషువ వీడ్కోలు (24 అధ్యా) :**

**అ) యెహోషువ స్థితి :** యెహోషువ వృద్ధుడయ్యాడు గనుక, ఇక తాను ఎక్కువ కాలం బ్రతకడని తెలిసి, చివరిగా ఇశ్రాయేలీయులకు కొన్ని హెచ్చరికలివ్వాలనుకొన్నాడు. మొదట నాయకులను, తరువాత ప్రజలందరిని పిలిచి, దేవుని శక్తిని ఆయన నమ్మకత్వాన్ని జ్ఞాపకం చేస్తూ, ఆయన పట్ల నమ్మకంగా ఉండాలని మరియు భ్రష్టులుకావద్దని హెచ్చరించాడు. (24:14,15). అతని తీర్మానంలో అతని ఆధ్యాత్మిక స్థితి కనిపిస్తుంది (24:15).

**ఆ) ప్రజల స్థితి :** ప్రజలు కూడ తమ తీర్మానాన్ని బహిరంగముగా ఒప్పుకొన్నారు. (24:16-24). ఇలా ఐక్యంగా ఒప్పందాలు చేసికొంటే వాటికి తప్పకుండా కట్టుబడి ఉంటారు.

మనం నమ్మిన దానిని గూర్చి మరియు జీవించబోయే విధానాన్ని గూర్చి ఒప్పుకోవడం చాల మంచిది. (రోమా 10:9,10).

ఇ) **ఆ తరమువారి స్థితి :** యెహోషువ 110 సంవత్సరాలు బ్రదికాడు. అతని మరణానంతరం, ఆ తరము వారందరు యెహోవాను సేవించారు (24:31). యెహోషువ ప్రయాసమంతటికి అది ప్రతిఫలం అని చెప్పవచ్చును. ఆ తరము వారు యెహోషువకు అర్పించిన నివాళులు అవి.

ప్రియ సోదరా! సోదరీ! యెహోషువ దేవుని సేవకుడు. అతని ద్వారా దేవుడు తన సంకల్పాలను నెరవేర్చుకున్నాడు. ఆయన సంకల్పసిద్ధికొరకు ఒకవేళ ఆయన మిమ్మల్ని ఎన్నుకోవాలని కోరితే అందుకు మీరు సిద్ధంగా ఉన్నారా?

మనం క్రీస్తు కొరకు చేసే సేవ అంతా, ఆయన సంపూర్ణకార్యంలో ఒక భాగం మాత్రమే. ఆయన జతపనివారిగా, మన జీవితకాలంలో చేయగలిగినంత పనిచేసి ముగిస్తాము. కాని దేవుడు మరొకరి ద్వారా తన కార్యాన్ని కొనసాగిస్తూనే ఉంటాడు. దేవుడు తన పనిని అసంపూర్తిగా వదిలేయడు. ప్రతి ఒక్కరు చేయవలసిన పని సిద్ధంగా ఉన్నది. దేవునిపై స్థిరవిశ్వాసంతో, దృఢ సంకల్పంతో ఆ పనిని చేపట్టుట ద్వారా మనం ఆయనను ఘనపర్చ వచ్చును.

మోషే మరణించాడు. కాని ఇశ్రాయేలు ప్రయాణం కొనసాగించబడింది. మంచి పనివాడు ఎప్పుడూ మరొక ఆయుధాన్ని పదును చేసికొని సిద్ధంగా ఉంటాడు. అలా యెహోషువ సిద్ధపరచబడ్డాడు. దేవుడు ఆ బాధ్యతను అప్పగించినప్పుడు సంతోషంగా స్వీకరించాడు. మన మధ్యలో ఉన్న నాయకులలో ఎవరో ఒకరు మరణించవచ్చును. వారి భారాన్ని మోయడానికి మరో యౌవనస్థుడు సిద్ధంగా ఉండాలి. పరిచర్య కొనసాగింపు, అవకాశాలను అందుకొనేందుకైన సంసిద్ధతను సూచిస్తుంది. పౌలు మరణించాడు కాని అతడు ప్రకటించిన సిలువ నేటికీ నిలిచి ఉన్నది. నిజమైన నాయకులు ఈలోకాన్ని విడిచి, కనిపించకుండపోయినా, వారి పని ఆగిపోదు గనుక ఆ పనిలోనే నిలిచి ఉంటారు. అట్టి ధన్యత ప్రభువు మనందరికి దయచేయును గాక!

**ప్రేమధార పాఠకులకు ఒక విజ్ఞప్తి**

భారత దేశములో గత 30 సం॥గా రేడియో ద్వారా సువార్తను ప్రకటిస్తున్న ట్రాన్స్ వరల్డ్ రేడియో-ఇండియా దర్శనం ప్రకారం రేడియో ద్వారా సువార్త ప్రకటించి, రక్షించబడిన వారిని సంఘాలలో బలపర్చాలని, సామాజిక వికాస పథకాల ద్వారా సమాజాన్ని రూపాంతరపర్చాలని ఆశిస్తున్నాం. అందుకు మీ ప్రార్థన, ఆర్థిక సహకారాలు ఎంతైన అవసరం. రేడియో పరిచర్య నిమిత్తం మీరు పంపించే విరాళాలు (చెక్కు/డిమాండ్ డ్రాఫ్ట్/మనియార్డర్) "ట్రాన్స్ వరల్డ్ రేడియో-ఇండియా" (Trans World Radio - India) పేరు మీద తీసి మా చిరునామాకు పంపించవలసినదిగా మనవి చేస్తున్నాము. ప్రభువు మీకిచ్చిన ధనాన్ని విలువైన దాని కొరకు పెట్టుబడిగా పెట్టి నిత్యత్వంలో అధిక లాభాన్ని పొందాలని ఆశిస్తున్నాం. ప్రభువు మిమ్మల్ని, మీ కుటుంబాన్ని సమృద్ధిగా దీవించునుగాక! ఆమేన్!!



# గొప్ప నాయకులు

## (న్యాయధిపతులు గ్రంథ సంగ్రహ సమీక్ష)

### A. ఉపోద్ఘాతము :

యెహోషువ తరువాత 350 ఏండ్ల ఇశ్రాయేలు చరిత్ర న్యాయాధిపతుల గ్రంథంలో వ్రాయబడింది. ఈ 350 సంవత్సరాలు, ఇశ్రాయేలు చరిత్రలో చీకటి కాలంగా ఎంచబడింది. ఐగుప్తులో సుదీర్ఘ దాసత్వం అనంతరం 40 సం॥లు అరణ్యంలో సంచార జీవులుగా జీవితాన్ని గడిపిన ఇశ్రాయేలు ఇప్పుడు స్థిరపడే సమయం వచ్చింది. ఈ మార్పు అంత సులభమైనది కాదు. ఒక జాతి జాతీయ జీవితం కొరకు సర్దుబాట్లు చేసికొంటున్న కాలం అది. వారి పతనాలు, పతనాల ఫలితాలు, వారి విషయం దేవుడు జోక్యం చేసికొన్న విధానాల వివరణనే ఈ గ్రంథ సారాంశం.

1. **గ్రంథకర్త :** గ్రంథకర్త ఎవరో ఖచ్చితంగా తెలియదు. కాని బహుశా సమూయేలుకాని, లేక అతని విద్యార్థియైన ఒక ప్రవక్త కాని వ్రాసి ఉండవచ్చును. తాల్మూద్ గ్రంథం సమూయేలేవ్రాసాడని సమర్థిస్తుంది. బహుశా అది వాస్తవం కూడ కావచ్చు. ఎందు చేతనంటే అతడు న్యాయాధిపతుల కాలానికి, రాజులకాలానికి మధ్యలో ఉన్నవాడు.
2. **గ్రంథ రచన కాలం :** న్యాయాధిపతులు 18:31, 20:27 ను బట్టి షిలోహులో నుండి మందసం పట్టబడ్డాక వ్రాయబడి ఉండవచ్చును. ఈ గ్రంథంలో "ఆ దినములలో ఇశ్రాయేలీయులకు రాజు లేడు" అన్న మాట పలుమార్లు వ్రాయబడింది (17:6; 18:1; 19:1; 21:25). కనుక సౌలు రాజుగా చేయబడ్డాక, మరియు ఐక్యరాజ్యము విడిపోక ముందు వ్రాయబడి ఉండవచ్చును. ఆ దినాలలో యెబూసీయులు ఆ దేశంలో ఇంకా నివసించారు (1:21) అంటే దావీదు వారిని నాశనం చేయకముందు (II సమూ 5:5-9) అనగా సమూయేలు కాలంలోనే క్రీ.పూ. 1043-1004 మధ్యకాలంలో వ్రాయబడియుండవచ్చును.
3. **ముఖ్యాంశం:** మానవుల నిరంతర పతనం, వైఫల్యం మరియు దేవుని ఎడతెగని కృప.
4. **గ్రంథ విశిష్టత :**

అ) మానవులు దేవుణ్ణి మరచిపోయినా, దేవుడు తన నిబంధనను మరచిపోడు గాని, మనల్ని తిరిగి ఆయనవైపు త్రిప్పుకోడానికి మన అపరాధాలను, బలహీనతలను అనుమతిస్తాడని ఈ గ్రంథం తెలియజేస్తుంది.

ఆ) దేవుడు బలహీనులైనవారిని వాడుకొనుటలో ఆనందిస్తాడని, వారి ద్వారా గొప్ప కార్యాలను చేయిస్తాడని ఈ గ్రంథం స్పష్టంచేస్తుంది. (I కొరి 1:27) ఉదా - ఎడమ చేతి వాటం

గల ఎహూదు (3:15) ములుకోలు ఆయుధంగా గల షమ్గరు (3:31) దెబోరా అనే స్త్రీ (4:4), ఎన్నికలేని గోత్రం మరియు కుటుంబానికి చెందిన గిద్యోను (6:15) కుండలు, దివిటీలనే ఆయుధాలుగల చిన్న సైన్యం (7:8,16) సమ్సోను ఉపయోగించిన గాడిద దవడ ఎముక (15:14-19).

ఇ) న్యాయాధిపతులందరు దేవుని ఆత్మద్వారానే విజయాలను సాధించగలిగారు. ఒత్నీయేలు (3:10) గిద్యోను (6:34) యెఫ్తా (11:29) సమ్సోను (13:25; 14:6; 15:14).

5. న్యాయాధిపతుల గ్రంథం యెహోషువ గ్రంథానికి పూర్తిగా భిన్నమైనది.

అ) యెహోషువ గ్రంథంలో ప్రజలు దేవుని శక్తిని నమ్మి జయంపొందారు. న్యాయాధిపతుల కాలంలో ప్రజల తిరుగుబాటుతనమును బట్టి ఇతరులచే జయించబడి వారికి దాసులయ్యారు.

**ఈ రెండు గ్రంథాల వ్యత్యాసాన్ని గమనిద్దాం :**

| **యెహోషువ** | **న్యాయాధిపతులు** |
|---|---|
| 1) ఆనందం | 1) అసువులు |
| 2) పరలోక దర్శనం | 2) భూసంబంధమైన ప్రాధాన్యత |
| 3) విజయం | 3) అపజయం |
| 4) అభివృద్ధి | 4) క్షీణత |
| 5) విశ్వాసం | 5) అవిశ్వాసం |
| 6) స్వాతంత్ర్యం | 6) దాసత్వం |

న్యాయాధిపతుల గ్రంథం ఇశ్రాయేలు ప్రజల హీనస్థితితో ప్రారంభమై దాస్యాలు, విడుదలతో కొనసాగించబడి, అతి దుర్మార్గ స్థితిని గూర్చిన రెండు దృష్టాంతాలతో ముగించబడింది. ప్రొఫెసర్ మూర్ హెడ్ ఈ గ్రంథాన్ని ఏడు భ్రష్టతలు, ఏడు అన్యజాతులకు ఏడు దాస్యాలు, ఏడు విమోచనలు అని విభజించాడు.

## B. గ్రంథ విభజన :

| | | |
|---|---|---|
| **I.** | **ఉపోద్ఘాతం** | **1,2 అధ్యా** |
| **II.** | **న్యాయాధిపతుల కాలము** | **13-16 అధ్యా** |
| **III.** | **న్యాయాధిపతుల కాలపు ఫలితాలు (ముగింపు)** | **17-21 అధ్యా** |

## C. అంశాల వారిగా సంక్షిప్త వివరణ :

### I. న్యాయాధిపతుల కాలం నాటి ఇశ్రాయేలు ఆధ్యాత్మిక, రాజకీయ స్థితి :

యెహోషువ మరణానంతరం ఇశ్రాయేలీయులు దేవుణ్ణి మరచిపోయారు (2:13). స్త్రీలు, పురుషులు, పిల్లలు తమ ఇష్టానుసారంగా జీవించారు. ఇశ్రాయేలు చరిత్ర,



తిరుగుబాటుతనం మరియు పాపముతోనే గడిచిపోయినట్లు కనిపిస్తుంది. కొంత జాగ్రత్తగా గమనిస్తే, సుమారు 100 సం॥లు వారు దేవునికి అవిధేయత చూపించారు. ఎక్కువ కాలం వారు అవిధేయులయ్యారు గనుక వారి జీవిత కాలంలో తక్కువ అభివృద్ధిని చూసారు. ఈ గ్రంథం రాజీతత్వంతో ఆరంభించబడి కలవరస్థితితో ముగించబడింది. దేవునికి సమర్పించుకోని ప్రతి జీవితం ఇలాగే ఉంటుంది.

దేవుడు వారి పట్ల కృప చూపిస్తూ, తన సంకల్పాన్ని నెరవేరుస్తూ ఉన్నా, ప్రజలు పదే పదే తిరుగుబాటు చేసారు ఇశ్రాయేలు పాపము ఒకే విధంగా ఉన్నా, దేవుడు వారిని విడిపించిన విధానాలు, ఉపయోగించిన సాధనాలు పలు విధాలుగా ఉన్నాయి.

ఆ కాలంలో ఇశ్రాయేలీయులకు రాజులేదు (17:6) వారు న్యాయాధిపతులచే పరిపాలించబడ్డారు. ఏలీ, సమూయేలుతో పాటు 15 మంది న్యాయాధి పతులున్నారు. (అబీమెలెకు దేవునిచే పిలువబడిన న్యాయాధిపతి కాదు). వీరిలో గిద్యోను మరియు సమ్సోనులాంటి యుద్ధవీరులు, ఏలీలాంటి యాజకులు, సమూయేలు లాంటి ప్రవక్తయైన న్యాయాధిపతులున్నారు.

### II. ఇశ్రాయేలు చెడిపోయిన స్థితి-కనానును పూర్తిగా జయించుటలో వైఫల్యం (1:1-3:4) :

1. **కనానును పూర్తిగా జయించుటలో ఇశ్రాయేలు వైఫల్యం :** ఇశ్రాయేలీయులు తాము స్వాధీనం చేసికొన్న దేశంలో నుండి తమ శత్రువులను వెళ్ళగొట్టక పోవడమే వారి పతనానికి కారణం. యూదా గోత్రము (1:1-20) బెన్యామీను గోత్రము (1:21) యోసేపు గోత్రము (1:22-29). జెబూలూను (1:30), ఆషేరు (1:31,32) నఫ్తాలి గోత్రము (1:33) దాను గోత్రము (1:34-36). వీరందరి వైఫల్యం, అవిధేయత ఓటమికి దారి తీసింది (2:2,3).

దేవుడు, ఇశ్రాయేలీయులను కనానులోనికి తీసికొని వెళ్ళకముందే శత్రువులను ఎందుకు వెళ్ళగొట్టలేదు అన్న ప్రశ్న రావచ్చును. కాని అందుకు ముఖ్య కారణం ఉంది. అంతకు ముందు యుద్ధమును చూడని తరానికి యుద్ధం చేయడానికి నేర్పించేందుకు, మరియు వారు దేవుని ఆజ్ఞలను అనుసరిస్తారో లేదోనని వారిని పరిశోధించడానికి ఆ శత్రువులను దేవుడు ఉండనిచ్చాడు (3:1-4). ఇశ్రాయేలీయులే వారితో యుద్ధము చేసి వారిని వెళ్ళగొట్టాలి.

దేవుడు మన పాపాన్ని, బలహీనతను మనకు చూపించేందుకు మన అల్ప విశ్వాస ఫలితాలను వాడుకొంటాడు ఇశ్రాయేలు అవిధేయత రోమా 5:20 లోని మాటల్ని జ్ఞాపకం చేస్తుంది. పాపం ఎక్కడ విస్తరిస్తుందో అక్కడ కృప విస్తరిస్తుంది. దేవుని దీర్ఘ

శాంతం, ప్రజల మొఱలకు జవాబిచ్చేందుకైన ఆయన ఎడతెగని సిద్ధపాటు ఈ గ్రంథంలో గోచరమౌతుంది. (3:9,15; 4:3-7; 6:6-12; 10:15,16).

ఏర్పరచబడిన ఆ ప్రజలు పరిశుద్ధులు అని తెలిసికోవాలని దేవుడు ఆశించాడు. వారు అన్యులతో కలిసిపోకూడదు. ఈ ప్రత్యేకతనే వారిని బలవంతులుగా చేస్తుంది. నేటి క్రైస్తవులు కూడ దేవునికి దగ్గరగా ఉండాలి. పాపానికి, అవినీతికి వ్యతిరేకంగా పోరాడాలి. (ఎఫె 6:10-18).

**2. శత్రువులను పూర్తిగా జయించనందుకు వచ్చిన దేవుని తీర్పు (2:1-3:4) :**

అ. యెహోవా దూత తీర్పును ప్రకటించుట (2:1-5).

ఆ. దైవ భక్తిగల తరమువారందరు చనిపోవుట (2:6-10).

ఇ. దేవుని తీర్పు వర్ణించబడుట (2:11-19).

ఈ. వారు పరీక్షించబడేందుకు శత్రువులకు ఉండనిచ్చుట (2:20-3:4).

## III. ఏడు దాస్యాల నుండి ఇశ్రాయేలు విడుదల (3:5-16:31) :

### అ. దక్షిణ భాగంలో దండయాత్ర (3:5-31) :

1. **మొదటి భ్రష్ఠత (3:1-11) :** దేవుడు ఇశ్రాయేలు విగ్రహారాధనను బట్టి అరామ్నహరాయిము (మెసపొతమియ) రాజైన కూషన్రిషాతాయిము చేతికి వారిని అప్పగించాడు. 8 సంవత్సరాలు అతనికి దాసులుగా ఉన్నారు. ఇశ్రాయేలు యెహోవాకు మొఱ పెట్టినప్పుడు దేవుడు కాలేబు తమ్ముడైన కనజు కుమారుడు, ఒత్నీయేలును రక్షకునిగా నియమించాడు. అతడు ఆ రాజును జయించి, తన ప్రజలను విడిపించాడు. ఒత్నీయేలు సామాన్యమైన వాడే, కాని అతడు దేవుని ఆత్మ స్వాధీనంలో ఉన్నాడు గనుక, దేవుడు అతని చేత అసాధారణ కార్యం చేయించాడు. అతని కాలంలో దేశం 40 సం॥లు నెమ్మదిగా ఉండినది. కాని యెహోషువలాగే అతడు తన తదనంతరం మరో నాయకుణ్ణి సిద్ధంచేయలేదు.

2. **రెండవ భ్రష్ఠత (3:15-30) :** ఈసారి దేవుడు వారిని యోయాబు రాజైన ఎగ్లోనుకు అప్పగించాడు. 18 సం॥లు వారు బాధననుభవించారు. వారిని విడిపించేందుకు ఏహూదును రక్షకునిగా నియమించాడు. ఇతడు ఎడమచేతివాటముగలవాడు. ఇతడు శత్రువును చంపడానికి, తన ఎడమ చేతి వాటంతో పాటు స్వంత విధానాన్ని అవలంబించాడు. ఇతని కాలంలో ప్రజలు 80 సంవత్సరాలు నెమ్మదిగా ఉన్నారు. ఇతడు కూడ మరో నాయకుణ్ణి సిద్ధం చేయడంలో విఫలమయ్యాడు. ప్రజల తిరిగి పాపానికి, ఆత్మీయ భ్రష్ఠత్వానికి లోనయ్యారు.



### ఆ. ఉత్తరభాగంలో దండయాత్ర (4:1-5:31).

3. **మూడవ భ్రష్ఠత (4:1-5:3) :** యెహోవా దృష్టికి దోషులైన ఇశ్రాయేలీయులను కనాను రాజైన యాబీను చేతికి అప్పగించాడు. అతడు వారిని 20 సం॥ బాధపెట్టాడు. దేవుడు వారి మొఱను విని దెబోరా ద్వారా విడుదలనిచ్చాడు. దెబోరా ఒక ప్రవక్తిగా దేవుడు తనకు సెలవిచ్చిన దానిని బారాకుకు తెలియజేసింది. ఆ కాలంలో నాయకత్వం లేని లోపం స్పష్టంగా తెలుస్తుంది. బారాకు, దెబోరా రానిదే యుద్ధానికి వెళ్ళనన్నాడు. వారిద్దరు 10,000 సైన్యాన్ని నడిపించారు. కనానీయులను జయించడానికి మరి 10,000 మంది స్వచ్ఛందంగా యుద్ధంలో పాల్గొన్నారు. అయినా వారి విజయానికి కారణం ఇద్దరు స్త్రీలని చెప్పవచ్చును. యాయేలు సమయోచిత జ్ఞానంతో సీసెరాను చంపివేసింది. వారికి కలిగిన గొప్ప విజయం, మరియు విడుదలను బట్టి వారు పాడిన కీర్తన 5వ అధ్యాయంలో వ్రాయబడింది. చెప్పలేని భావాలతో నింపబడిన ప్రతి ఒక్కరిలో నుండి సంగీతం ఉద్భవిస్తుంది. దేవునితో సంబంధం కలిగిన ప్రతి విశ్వాసి అలా పాడగలుగుతాడు. (కీర్త 100; ఎఫె 5:18,19; కొల 3:16).

### ఇ. మధ్య ప్రాంతంలో దండయాత్ర (6:1-10:5)

4. **నాల్గవ భ్రష్ఠత (6:1-8:32) :** ఇశ్రాయేలీయులు దేవునికి వ్యతిరేకంగా చేసిన పాపాన్ని బట్టి నాల్గవసారి దేవుడు వారిని మిద్యానీయుల చేతికి అప్పగించాడు. ఈసారి 7 సం॥లు మాత్రమే దాస్యంలో ఉండడం గమనార్హం. దేవుడు గిద్యోను నాయకత్వంలో కేవలం ఎంపిక చేయబడిన 300 మంది సైన్యంతో, దివిటీలు, ఖాళీ కుండలనే ఆయుధాలతో వేలాది మిద్యానీయుల సైన్యంపై విజయాన్ని ఇచ్చాడు. సమర్పణ మరియు ధైర్యముగల ఈ కొద్దిమంది విషయం దేవుడు లేవీయ కాండము 26:7,8 లోని వాగ్దానాన్ని నెరవేర్చాడు. గిద్యోను కూడ మోషే ధర్మశాస్త్రములో వ్రాయబడిన నియమాలను పాటించుటను బట్టి విజయాన్ని సాధించగలిగాడు. (ద్వితీ 20:1-8). ఈలాంటి కొద్ది మందితో మనం భూలోకాన్ని తలక్రిందులు చేయగలం. దేవునికి కావలసింది. సమర్పణగల చిన్నమందనే. మరలా దేశంలో 40 సంవత్సరాలు నెమ్మది ఉండినది.

5. **ఐదవ భ్రష్ఠత (8:33-10:5) :** గిద్యోను మరణానంతరము ఇశ్రాయేలీయులు యెహోవాను జ్ఞాపకము చేసికోలేదు. గిద్యోను వారికి చేసిన ఉపకారాన్ని కూడ మరచిపోయారు. అతని కుమారులలో ఒకడైన అబీమెలెకు తన తల్లి సహోదరులతో కలిసి, కుట్రతో తన 70 మంది సహోదరులను చంపాడు. గిద్యోను చిన్న కుమారుడైన యోతాము మాత్రము తప్పించుకొన్నాడు (9:1-5). అబీమెలెకు 3 సం॥లు ఇశ్రాయేలీయులను ఏలిన తరువాత షెకెము యజమానులకు అతనికి వైరము కలుగునట్లు దేవుడు వారి మీదికి దురాత్మను పంపించాడు (9:22-26). అప్పుడు వారు అబీ మెలెకును వంచించారు. గాలును తమకు నాయకునిగా చేసికొన్నారు. ఈ

విధంగా ఇరుపక్షాలవారికి జరిగిన యుద్ధంలో అబీమెలెకు చంపబడ్డాడు(9:50-57). తరువాత ఇశ్శాఖారు గోత్రికుడైన తోలా న్యాయాధిపతిగా నియమించబడ్డాడు. అతడు 23 సం॥లు న్యాయాధిపతిగా ఉన్నాడు (10:1,2). అతని తరువాత గిలాదు దేశస్థుడైన యాయీరు నియమింపబడి 22 సం॥లు ఇశ్రాయేలీయులకు న్యాయాధిపతిగా ఉన్నాడు. (10:3-5).

**ఈ. తూర్పు భాగంలో దండయాత్ర (10:6-12:7)**

**6. ఆరవభ్రష్టత (10:6-12:7) :** ఈసారి దేవుడు వారిని అమ్మోనీయుల చేతికి అప్పగించాడు. వారు ఇశ్రాయేలీయులను 18 సం॥ల బాధపెట్టారు. యెహోవా ఆత్మ యెఫ్తామీదికి రాగా, అతడు అమ్మోనీయులతో యుద్ధం చేసి వారి చేతిలో నుండి ఇశ్రాయేలీయులను విడిపించాడు. అతడు 6 సం॥లు వారికి న్యాయాధిపతిగా ఉన్నాడు.

**ఉ) ఉత్తర భాగంలో రెండవ దండయాత్ర (12:8-5) :** యెఫ్తా తరువాత ఇబ్సాను 7 సం॥లు (12:8-10), అతని తరువాత ఏలోను 10 సం॥లు (12:11,12). తరువాత అబ్దోను 8 సం॥లు న్యాయాధిపతిగా ఉన్నారు (12:13-15).

**ఊ) పశ్చిమ భాగంలో దండయాత్ర (13:1-6:31)**

**7. ఏడవ భ్రష్టత (13-16 అధ్యా) :** ఈసారి ఇశ్రాయేలీయులు దీర్ఘ కాలం అనగా 40 సం॥లు ఫిలిష్తీయులకు దాసులుగా ఉన్నారు. సమ్సోను 20 సంవత్సరాలు న్యాయాధిపతిగా ఉన్నా, ఫిలిష్తీయుల నుండి ఇశ్రాయేలీయులను సంపూర్ణంగా రక్షించలేదు. యేసు క్రీస్తు తాను జీవించిన కాలములో రక్షించినవారికంటె, తన మరణం ద్వారా ఎక్కువ మందిని రక్షించాడు. సమ్సోను అందుకు పూర్తిగా విరుద్ధంగా తాను బ్రతికి ఉన్నప్పటికంటె, తన మరణ సమయంలో ఎక్కువ మందిని చంపాడు. దేవుని ఆత్మాభిషేకం విషయం తప్ప సమ్సోను, భౌతికంగాను, నైతికంగాను బలహీనుడే.

## IV. కనానీయుల వలె పాపం చేసిన ఇశ్రాయేలు నైతిక పతనం (17:1-21:25):

**1. విగ్రహారాధన అనే వైఫల్యత.**

**అ. వ్యక్తిగత విగ్రహారాధన (17:1-13).**

**ఆ. గోత్రము యొక్క విగ్రహారాధన (18:1-31).**

మీకా అనే ఎఫ్రాయీమీయుడు, తన తల్లి డబ్బునే దొంగిలించాడు. అతని తల్లి అతన్ని విగ్రహారాధనకై ప్రేరేపించడం ఆశ్చర్యమైన విషయం. అతడు వారి ఇంటిలోని దేవమందిరంలోనే గృహదేవతలను చేయించి పెట్టి తన కుమారులలో ఒకని యాజకునిగా ప్రతిష్ఠించాడు. తరువాత యూదా బేత్లెహేము నుండి వచ్చిన లేవీయుని జీతానికి కుదుర్చుకున్నాడు (17:7-13). ఈ యాజకుడే దానీయులు మీకా ఇంటినుండి



దౌర్జన్యంగా దోచుకున్న ఏఫోదును, గృహదేవతలను, చెక్కబడిన ప్రతిమ మరియు పోత విగ్రహాలను తీసికొని వెళ్ళినప్పుడు వారికి యాజకునిగా ఉండేందుకు ఒప్పుకొన్నాడు. అందుకు కారణం అతని దురాశ. వారు అతన్ని నీవు ఒక ఇంటివారికే యాజకునిగా ఉండడం కన్న ఒక గోత్రానికి యాజకుడైయుండడం మేలని ప్రలోభపెట్టారు. దేవుని మందిరము షిలోహులో ఉన్నంత కాలం దానుగోత్రీయులు మీకా చేయించిన ప్రతిమను పూజిస్తూవచ్చారు.

**2. నైతిక పాపం అనే వైఫల్యం (19:1-30) :** ఈ పాపం కూడ వ్యక్తిగతంగా ప్రారంభమై (19:1-10) తరువాత బెన్యామీను గోత్రానికి వ్యాపించింది. (19:11-30). లేవీయుడైన ఒకడు అపనమ్మకస్తురాలైన తన ఉప పత్నితో బెన్యామీనీయుల గిబియాలో ఉన్నప్పుడు ఈ ఘోరం జరిగింది. వారు ఒక వృద్ధుని ఇంట్లో బసచేయగా, ఆరాత్రి ఆ ఊరిలోని పోకిరిలు ఆ యింటిని చుట్టు ముట్టి ఆ లేవీయునితో పాపం చేయడానికి బయటికి పంపించమని అడినప్పుడు తన భార్యను వారికి అప్పగించాడు. ఆలేవీయుడు, మానభంగం చేయబడి చనిపోయిన తన భార్యను చూసి మానసిక ఆందోళనతో, ఆమె మృత దేహాన్ని 12 ముక్కలుగా కోసి, ఇశ్రాయేలు 12 గోత్రాలకు పంపించాడు. ఇశ్రాయేలీయులకు చాల కోపం వచ్చింది. ఈ విషయం వారు తీవ్రంగా ఆలోచించి ఓ తీర్మానం చేసికోవాలనుకొని 4,00,000 మందిని యుద్ధానికి సమకూర్చారు.

**3. గోత్రాల మధ్య యుద్ధం అనే వైఫల్యం (20:1-21:25) :** బెన్యామీనీయులు ఈ పాపానికి పాల్పడిన తమ గోత్రికులను అప్పగించడానికి నిరాకరించడంతో గోత్రాల మధ్య అంతర్యుద్ధం జరిగింది. బెన్యామిను గోత్రం ఓడించబడింది, ఇశ్రాయేలీయులు 40,000 మందిని కోల్పోయారు. బెన్యామియుల 26000 సైన్యంలో 600 మంది మాత్రమే మిగిలారు.

## V. ముగింపు :

న్యాయాధిపతుల గ్రంథం ద్వారా వ్యక్తిగతంగా మనం తెలిసికోవలసినదేమంటే, ఇశ్రాయేలీయులు ఐగుప్తు నుండి విడిపించబడి, అరణ్యయాత్ర ముగించి తమ వాగ్దాన భూమిలో ప్రవేశించాక కూడ ఆధ్యాత్మిక భ్రష్టత్వానికి లోనైనట్లు, యేసు క్రీస్తును రక్షకునిగా అంగీకరించి, విమోచించబడిన మనందరం సంపూర్ణంగా విజయవంతమైన జీవితాన్ని కలిగి ఉంటామని ఖచ్చితంగా చెప్పలేము. కొంతమంది పడిపోయే అవకాశం ఉంది (I కొరి 10:12-14). అయితే పశ్చాత్తాపంతో దేవుని ఆశ్రయించిన వారిని, ఆయన తిరిగి సమకూరుస్తాడు. (కీర్త 23:3; 51:1-12; I యోహా 1:9). అలా తిరిగి విజయపథం వైపు కొనసాగగలము. కనుక న్యాయాధి పతుల గ్రంథాన్ని ఆధ్యాత్మికంగా వెనుకబడిన వారి (Back sliders) గ్రంథంగా పిలువవచ్చును.

# గొప్ప సమీప బంధువు

## (రూతు గ్రంథం సంగ్రహ సమీక్ష)

### A. ఉపోద్ఘాతము :

బైబిలులోని 66 గ్రంథాల సారాంశమంతా ఒక్కటే, మానవ విమోచన, మానవుల రక్షణ కొరకైన దేవుని ప్రణాళికను అర్థం చేసికొనే విధంగా, ఆకట్టుకొనే రీతిగా వివరించబడిన గ్రంథమే రూతు. ఈ గ్రంథంలో యేసు క్రీస్తు మన గొప్ప సమీపబంధువుగా ప్రత్యక్షపరచబడ్డాడు.

1. **ఉద్దేశం :** రూతు గ్రంథం ఓ సుందర ప్రేమ గాథ. ఈ ప్రేమ గాథలో మన రక్షకుడైన యేసుకు మన పట్లగల దైవిక ప్రేమను అద్దం పట్టినట్లు చూసుకోవచ్చును. మన రక్షణ ద్వారా క్రీస్తుతో ఏర్పడే సంబంధాన్ని, మరియు మన విమోచనను అర్థం చేసికొని, అనుభవపూర్వకంగా తెలిసికోవాలన్నదే ఈ గ్రంథ ముఖ్యోద్దేశం.

2. **గ్రంథకర్త :** ఈ గ్రంథములో గాని, బైబిలులో మరెక్కడగాని, రూతు గ్రంథాన్ని వ్రాసినవారిపేరు ప్రస్తావించబడలేదు. తాల్మూద్ గ్రంథంలో దీని గ్రంథకర్త సమూయేలు అని వ్రాయబడింది. కాని అది వాస్తవంకాదని చెప్పవచ్చు. ఎందుచేతనంటే సమూయేలు దావీదుకు పట్టభిషేకం చేయబడకముందే చనిపోయాడు (I సమూ 25:1). కాని ఈ గ్రంథంలో దావీదు పేరు వ్రాయబడింది. ఈ గ్రంథంలోని వంశావళిలో సొలొమోను పేరు లేదు గనుక, బహుశా ఇది దావీదు పరిపాలన కాలంలో వ్రాయబడి ఉండవచ్చును. అయితే గ్రంథకర్త ఎవరో తెలియదని ఇందులోని ఆధ్యాత్మిక విలువలను ప్రక్కన పెట్టలేము.

3. **గ్రంథ విశిష్టత :** ఈ గ్రంథంలో యేసు వంశావళి వరుసలో, దావీదు వంశావళి ఉంది. ఈ వంశావళి లేనిదే దావీదు వంశాన్ని యూదా వంశానికి జతపర్చలేము. ఆదికాండము నుండి బేత్లెహేముకు, బేత్లెహేము నుండి సిలువకు గల గొలుసులాంటి పొందికలో ఈ పుస్తకం ఒక కొలికిలా ఉంది. అందుకే ఈ గ్రంథం ప్రమాణిక గ్రంథముగా ఎంచబడి బైబిలులో చేర్చబడింది.

   న్యాయాధిపతుల కాలంలో ఆత్మీయ భ్రష్టత్వం, హింస, యుద్ధాలు, నైతిక భ్రష్టత ఉన్నా, మరో ప్రక్క దేవుని వాక్యానికి విధేయత చూపించే శేషం కూడ ఉందని ఈ గ్రంథం నిరూపిస్తుంది.

4. **మూలవచనం :** "నీవు వెళ్ళుచోటికే నేను వచ్చెదను, నీవు నివసించు చోటనే నేను నివసించెదను, నీ జనమే నా జనము, నీ దేవుడే నా దేవుడు" (1:16).

5. **మూలపదం :** విమోచన, ఈ చిన్న పుస్తకంలో విమోచకుడు అని అర్థమిచ్చే గోయెల్ అనే మాట 13 సార్లు వ్రాయబడింది.



### B. గ్రంథ విభజన :

4 అధ్యాయాలు గల ఈ గ్రంథాన్ని మనం భౌగోళికంగా 4 భాగాలుగా విభజించవచ్చును.

| | | |
|---|---|---|
| 1. | మోయాబు దేశంలో జరిగిన విషయాలు | 1 అధ్యా |
| 2. | బోయజు పొలంలో జరిగిన విషయాలు | 2 అధ్యా |
| 3. | బోయజు కళ్ళము వద్ద జరిగిన విషయాలు | 3 అధ్యా |
| 4. | బోయజు హృదయం మరియు గృహములో జరిగిన విషయాలు | 4 అధ్యా |

### C. అంశాల వారిగా సంక్షిప్త వివరణ :

ఈ గ్రంథాన్ని రెండు ప్రధానాంశాలుగా కూడ విభజించవచ్చును.

**I. రూతు ప్రేమ ప్రదర్శించబడుట (1,2 అధ్యా) :**

అ. **నయోమితో ఉండాలన్న రూతు తీర్మానం (1:1-8) :** న్యాయాధిపతులు ఏలిన కాలంలో వచ్చిన కరవును బట్టి, ఎలీమెలెకు కుటుంబం మోయాబు దేశానికి వెళ్ళింది. దీన్ని మనం తప్పిపోయిన కుటుంబం అని చెప్పుకోవచ్చును. కరవులో కూడ దేవుడు తన ప్రజలను కాపాడగలడు (కీర్త 33:18). కాని అలాంటి సందర్భాలలో విశ్వాసాన్ని కోల్పోయిన వారిలో ఈ కుటుంబం ఒకటి.

మోయాబు దేశము మృతసముద్రానికి ఈశాన్య దిశలో ఉంది. మోయాబీయులు ఇశ్రాయేలుతో రెండుసార్లు యుద్ధం చేసారు (న్యాయా 3:12-30; I సమూ 14:47) మొదటి యుద్ధం తరువాత రెండు శతాబ్దాలకు, మరియు రెండవ యుద్ధానికి 80 సంవత్సరాల ముందు ఈ చరిత్ర అంతా జరిగింది.

వారు మోయాబు దేశంలో ఉన్నప్పుడు నయోమి తన భర్తను మరియు ఇద్దరు కుమారులను పోగొట్టుకొన్నది. దేవుడు తిరిగి తన ప్రజలను దర్శించాడని విన్న నయోమి బేత్లెహేముకు ప్రయాణమైంది. ఆమె కోడళ్ళు ఓర్పా, రూతు ఆమెతో కూడ వెళ్ళాలని బయలు దేరినప్పుడు, వారు తిరిగి వెళ్ళేందుకు అవకాశమిస్తూ నయోమి వారిని పోత్సహించింది. రూతు నయోమితోనే వెళ్ళేందుకు తీర్మానం చేసికొన్నది. రూతు, ఇశ్రాయేలీయుల భ్రష్టత్వమనే ఎడారిలో యథార్థత, నీతి అనే ఓయాసిస్‌లాంటిది. అన్యదేశం నుండి, వెలివేయబడిన ప్రజలలో నుండి వచ్చిన రూతు ఇశ్రాయేలు దేవుణ్ణి ఎరిగింది (1:16).

ఆ. **నయోమి పట్ల రూతుకు గల శ్రద్ధ మరియు భక్తి భావం (2:1-23) :** రూతు నయోమితో పాటు బేత్లెహేముకు వెళ్ళడం మాత్రమే కాదు, ఆమె పోషణ విషయం కూడ తానే బాధ్యత వహించింది. రూతు తన పేదరికాన్ని పోగొట్టుకోడానికి దేవుని ధర్మశాస్త్రాన్నే అనుసరించింది. పరదేశులు, పేదలు పరిగె ఏరుకొనే సదుపాయం గూర్చి

ధర్మశాస్త్రంలో చెప్పబడిన విషయాలను ఆమె పాటించింది. (లేవీ 19:9,10; 25:47-49; ద్వితీ 25:5-10). అంటే రూతుకు ధర్మశాస్త్రం తెలుసునన్న మాట.

ఆమె బోయజు పొలంలోనికి వెళ్ళింది. బోయజు మొదటి చూపుతోనే ఆమె పట్ల ఆకర్షితుడయ్యెను (2:5). ఆమె విషయం శ్రద్ధ చూపించడం (2:8,9) తనతోపాటు భోజనం చేయడానికి ఆహ్వానించడం (2:14) పనివారికి పురమాయించడం, హెచ్చరించడం (2:15,16) గమనించవచ్చు. ఆమెతో, మరొకరి పొలానికి వెళ్ళవద్దని, కోత అయిపోయేంత వరకు తన పొలంలోనే ఏరుకొమ్మని చెప్పాడు.

## II. రూతు ప్రేమకు ప్రతిఫలం ఇవ్వబడింది (3, 4 అధ్యా) :

నయోమి రూతు భవిష్యత్తు విషయం ధర్మశాస్త్రానుసారమైన పరిష్కారాన్ని యోచించింది. అందుకు రూతు చేయవలసిన దానిని గూర్చి వివరించింది (3:1-5). రూతు అత్త చెప్పినట్లే చేసింది (3:6-9). రూతు ప్రతిపాదనను విన్న బోయజు ఆనందంతో ఉప్పొంగిపోయాడు (3:10) తన అంగీకారాన్ని తెలిపాడు (3:11) కాని అతని సమస్యను వివరించాడు. (3:12). రూతు వివాహం చట్టపరంగా జరగాలంటే, మొదట ఆమెను విడిపించగల సమీపబంధువుకు అవకాశం ఇవ్వాలి. ఆకారణాన్ని బట్టే నయోమిగాని, బోయజు గాని రూతుతో ఇంతకు ముందు ఆ ప్రస్తావన తీసికొని రాలేదు. ఆమె అతని వద్ద 6-8 నెలలు పరిగె ఏరుకొన్నది. నయోమి వెంటనే సమీపబంధువు ధర్మమును గూర్చి చెప్పలేదు. తనకంటె ఇంకా చేరువైన సమీపబంధువు ధర్మము జరిపించాలి గనుక బోయజు కూడ ఈ విషయంలో తొందరపడలేదు.

పరస్పర ప్రేమ, ఆకర్షణలచే తొందరపడి వివాహం చేసికోవడం నష్టానికే కారణం అవుతుంది. కాని దేవుని చిత్తానుసారంగా, దేవుని వాక్యానికి లోబడి చేసికొన్న వివాహం శాశ్వతంగా నిలుస్తుంది. బోయజు వయస్సులో కొంత పెద్దవాడు (3:10). బోయజు, రూతు ప్రతిపాదన ప్రకారం చేస్తానని చెప్పలేదుకాని, చెయ్యడానికి సుముఖతను చూపించాడు. చట్టరీత్యా తనకంటె చేరువైన మరో సమీపబంధువు తీర్మానం కొరకు వేచి ఉన్నాడు. రూతుకూడ ధర్మశాస్త్రాన్నే పాటించింది (ద్వితీ 25:25-10). తొందరపడి వేరే యౌవనస్తులను వెంబడించలేదు. వారిద్దరు ఆ రాత్రి కళ్ళము వద్ద కలిసికొన్నా, తమ పవిత్రతను కాపాడుకొన్నారు. చట్టపరంగా జత పరచబడనిదే, లైంగిక సంబంధం కలిగి ఉండకూడదని వారికి తెలుసు (3:14).

ఇక సమీపబంధువు విషయానికొస్తే అతడు, విమోచించబడే వ్యక్తికి రక్తసంబంధియై ఉండాలి. (ద్వితీ 25:5,7-10); విమోచన క్రయధనం చెల్లించగలవాడైయుండాలి. విడిపించడానికి ఇష్టపడాలి. ఈ గ్రంథంలో బోయజు వీటన్నిటిని నెరవేర్చాడు. బోయజులో మనం యేసుక్రీస్తు మనకిచ్చిన వియోచనను చూడగలము. ఆయన మన



సమీపబంధువుగా ధర్మాన్ని నెరవేర్చేందుకు మనవంటి వాడయ్యాడు (యోహా 1:14; రోమా 1:3; ఫిలి 2:5-8; హెబ్రీ 2:14,15) మన విమోచన క్రయధనాన్ని చెల్లించాడు (I పేతు 1:18,19) మనల్ని విడిపించేదుకు ఇష్టపడ్డాడు. (మత్త 20:28, యోహా 10:15,18; హెబ్రీ 10:7).

విమోచన అన్నది వేదాంతపరమైనదిగా మారకముందు అది చట్టపరమైనదిగా ఉండినది. (లేవీ 25:47-49; ద్వితీ 25:5-10) ఈ వాక్యభాగంలోని చట్టాలు రూతు గ్రంథంలో నెరవేర్చబడ్డాయి.

రూతు పరదేశి, కాని విమోచన మరియు కృప అనే చట్టాలే ఆమెకు నిరీక్షణాధారంగా ఉండినవి. రూతుకు విమోచన అవసరమైనట్లే మానవులందరికి రక్షణ, అందునిమిత్తం రక్షకుడు అవసరం. రూతు బోయజును తన విమోచకునిగా ఉండమని అడిగినట్లే, ప్రతి ఒక్కరు యేసు క్రీస్తును వ్యక్తిగతంగా అడగాలి. పాపం నుండి విమోచించబడాలి.

నయోమి, రూతు విమోచన కొరకైన చట్టాలను గూర్చి చెప్పింది. వాటిని అమలు పరచమని బతిమిలాడింది. ఆలాగే సంఘముగా మనము యేసు ప్రభువు ద్వారా కలిగే రక్షణను గూర్చి లోకానికి చెప్పాలి. వారు దేవుని వాక్యాన్ని విశ్వసించి విధేయత చూపించునట్లు బతిమిలాడాలి.

వేరొక సమీప బంధువు రూతును విడిపించలేకపోయినట్లే (4:4;6:7) మన మంచిక్రియలు లేక ధర్మశాస్త్రం మనల్ని విమోచించలేవు. మనము నిజమైన రక్షకుని వైపు తిరిగినప్పుడే రక్షించబడగలము.

రూతు వైధవ్యం నుండి వైవాహిక జీవితంలోనికి, పేదరికం నుండి ఐశ్వర్యం గల స్థితికి వెళ్ళింది. ఈ రెండింటి విషయంలో ఆమె దేవుని వాక్యానికే ప్రాధాన్యతనిచ్చింది. ఇశ్రాయేలు జాతి అపనమ్మకంగా ఉన్నప్పుడు ఆమె చూపించిన నమ్మకత్వాన్ని బట్టి దేవుడు ఆమెకు ప్రతిఫలమిచ్చాడు. భర్తను, కుమారుణ్ణి మరియు యేసుక్రీస్తు వంశావళిలో స్థానాన్ని పొందింది.

"నీ జనమే నాజనము, నీ దేవుడే నా దేవుడు" అన్న ఆమె తీర్మానమే ఆమెను ఆ స్థితికి తీసికొని వచ్చింది. ప్రియ సోదరా! సోదరీ! మీ తీర్మానం ఏంటి? యేసు క్రీస్తును మీ సొంత రక్షకునిగా అంగీకరించారా? ఇంతవరకు తీర్మానం చేసికోనట్లైతే ఈరోజే తీర్మానం చేసికొనండి. ప్రభువు మిమ్మును దీవించునుగాక!

**TTB - Telugu - Study Outlines - Books of Joshua, Judges & Ruth**
Printed by : Premadhara, Trans World Radio - India, 12-1-334/17/3,
Lalapet, Secunderabad - 500 017. Ph : 040-27003011.

**FREE** MP3 DOWN LOAD - Log on to :
**www.radio882.com**